# కొత్త ఊపిరి

కోరుకొండ సత్యానంద్

రాజమండ్రి నుండి ద్వారపూడికి, ద్వారపూడి నుండి రాజమండ్రికి నేను రోజూ నాలుగైదుసార్లు తిరిగేవాడ్ని... పండుగల్లో, పెళ్ళిళ్ళ సీజన్లలో అయితే అర్ధరాత్రి వరకూ చాలాసార్లు తిరిగేవాడ్ని...

నేనలా తిరగడం మొదలుపెట్టిన కొత్తలో ఓసారి ధవళేశ్వరం ఊరి చివర రోడ్డు ప్రక్కనున్న ఓ తాటాకింటివైపు చూడ్డం జరిగింది... అప్పటినుండీ రాజమండ్రి వెళ్ళేటప్పుడు, ద్వారపూడి వెళ్ళేటప్పుడు నేనా ఇంటివైపు చూడకుండా ఎప్పుడూ వెళ్ళలేదు...

నేనా ఇంటివైపు చూడ్డానికి కారణం— ఓ అమ్మాయి!

అమ్మాయి అంటే, వయసులో ఉన్న అమ్మాయి కాదు... ఊహ తెలిసి లోకంలో ప్రతీదాన్నీ వింతగా చూడ్డం మొదలుపెట్టి కొన్ని మామూలు విషయాలు తెలుసుకొని, జీవితంలో ఇంకా ఎన్నో విషయాలు తెలుసుకోవాల్సిన— పదీ పదకొండేళ్ళ అమ్మాయి!

రంగు రంగుల గౌన్లు తొడుక్కొని, రెండు జడలువేసుకొని, రోజుకోరకం పూలు పెట్టుకొని ఇంటి పరిసరాల్లో తోటి పిల్లల్తో ఆడుకుంటూ, హాయిగా నవ్వుతూ, అప్పుడప్పుడూ రోడ్డు మీదికి వింతగా చూస్తూ ఉండేది...

ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, అప్పుడప్పుడూ రాత్రుళ్ళు కన్పించేదికాని ఉదయం తొమ్మిది గంటల తర్వాత మధ్యాహ్నం పన్నెండు గంటలలోపులో— మధ్యాహ్నం రెండు గంటల తర్వాత సాయంత్రం అయిదుగంటల లోపులో మాత్రం కన్పించేదికాదు... బళ్ళోకి వెళ్ళేదేమో! స్కూలు సెలవుల రోజుల్లో మాత్రం ఆ సమయాల్లో కూడా కన్పించేది బయట మట్టి అరుగుమీద కూర్చోనో, ఆడుకుంటూనో.

ఆ అమ్మాయిలో నన్ను బాగా ఆకట్టుకున్నది— గుండ్రటి కళ్ళతో ప్రతీదాన్నీ ఉత్సాహంగా ఏదో వింతను చూస్తున్నట్టుగా ఉండే ఆ చూపు... ఆ అమ్మాయి నన్నెంతగా ఆకట్టుకున్నదంటే— నేను అటు వెళ్ళిన ప్రతిసారీ ఆ అమ్మాయికోసం, ఆ అమ్మాయి రోడ్డు మీదకు చూసే చూపుకోసం ఆ ఇంటివైపు తప్పనిసరిగా చూసేవాడ్ని... చూడ్డం మరచిపోయేవాడ్ని కాదు!

ఆ అమ్మాయి గురించి, ఆ అమ్మాయి చూసే విధానంలోని చక్కదనం గురించి నేనింతకంటే ఎక్కువగానే చెప్పాలిగానీ— నా మనసులో భావానికి సరిపడే భాషరాదు నాకు!

ఎన్నోఏళ్ళుగానో నేనటువైపు వెళ్ళకపోయినా— మరో కొద్ది గంటల్లో అటువైపు వెళ్తానని తెలిసినా, ఆ అమ్మాయి తప్పకుండా కన్పిస్తుందన్న నమ్మకం నాకున్న— 'ఆ' విషయం పదే పదే గుర్తొచ్చి గుండెలో కలుక్కుమంటుది. అయినా ఇన్నాళ్ళూ నేనా విషయాన్ని మరచిపోయిన క్షణం ఉంటేగా!?

ఆ అమ్మాయి..., ఎదుగుతూ, మారుతూ వచ్చిన ఆ అమ్మాయి రూపం, అందం..., వయసెదుగుతున్నా ఏ మాత్రం మారని ఆ చిన్నప్పటి చూపు— అన్నీ కళ్ళముందు మెదిలి గుండె బరువెక్కిపోయి, మనసు మెలికలు తిరిగిపోయి, కళ్ళల్లో కన్నీటి సుళ్ళు తిరిగిన క్షణాలు ఎన్నో ఇన్నేళ్ళుగా!

ఆ అమ్మాయి కన్పించిన రోజునుండి, 'అది' జరిగిన క్షణం వరకూ ఒకొక్కటీ గుర్తుచేసుకుంటూ, ఇక్కడ నేను చేయాల్సిన పనులు చేస్తూ గడిపాను ఇన్నాళ్ళూ!

అప్పుడు ఓ వారం రోజులు వరుసగా నాకు కన్పించలేదు ఆ అమ్మాయి... ఊరెళ్ళి ఉంటుందేమో అనుకున్నాను గానీ ఆ అమ్మాయి కన్పించకపోవడంతో నాకేదో వెలితిగా ఉండేది...

ఆ రోజు నేను రాజమండ్రి వెళ్తూ చూసినప్పుడు ఆ ఇంటిముందు చాలా హడావుడిగా ఉంది... అక్కడి మనుష్యుల్ని, వాళ్ళు చేస్తున్న హడావుడిని బట్టి చాలా ఊహించేను... ఆ అమ్మాయి కన్పిస్తుందేమోనని ఆ రోజు అటువైపు వెళ్ళిన ప్రతిసారీ చూసేను...

ఆ అమ్మాయి ఆ రోజు కూడా కన్పించలేదు... కానీ, మర్నాడు కన్పించింది! ఆ అమ్మాయిని చూసి ఆశ్చర్యపడ్డాను... వెంటనే ఎంతో ఆనందపడ్డాను... ఆగని కాలం అన్ని పనుల్నీ చకచకా చేసుకుంటూనే పోతుంది కదా ఎప్పుడూ, అని అన్పించింది...

చిన్నపిల్ల— ఇప్పుడు చిన్న పిల్లకాదు... సరిగా వేసుకోవడం రాకపోయినా ఆ అమ్మాయి పైటవేసింది. కాలంతోపాటూ వచ్చిన వయసుకు వసంతం తోడొచ్చి ఆ అమ్మాయిలో ఎన్నిమార్పులొచ్చినా ఆ కళ్ళల్లో, ఆ చూపులో ఏ మార్పూ రాలేదు... అలాగే, చిన్నప్పటిలాగే ముచ్చటగా ఉండేది...

కొన్నాళ్ళయ్యాక రెండుమూడుసార్లు ఆ ఇంటి ముందు కొద్దిగా హడావుడిని చూడ్డం జరిగింది... ఒకసారి ఆ ఇంట్లో వాళ్ళు రోడ్డు వరకూ వచ్చి ఎవరికో అణుకువగా వీడ్కోలు చెప్పడం, మరోసారి ఎవర్నో ఇంట్లోకి ఆహ్వానిస్తుండడం చూసాను...

నాకు కొద్దిగా అర్థమయ్యింది అప్పుడు... ఆ తర్వాత కొన్నాళ్ళకి నేననుకున్నది నిజమయ్యింది.

ఆ రోజు రాజమండ్రి వెళ్ళేటప్పుడు ఆ ఇంటివైపు చూసిన నాకు ఏదో చేయాలని అన్పించింది... రాజమండ్రిలో 'బెజవాడ వెంకన్న' షాపుకు వెళ్ళేను... నాకు రోజూ ఉండే పనిని చూసుకోకుండా వెంటనే తిరుగుముఖం పట్టి ఆ ఇంటి దగ్గరకు వెళ్ళేను...

అక్కడ చాలా హడావుడిగా, కోలాహలంగా ఉంది... జనంలోకి వెళ్ళి తొంగిచూసాను... నాకెంతో కొండంత ఆనందంగా ఉంది...

నాకేమీ కాకపోయినా, నేనెప్పుడూ మాట్లాడకపోయినా నాకెందుకో ఆ అమ్మాయి అంటే— అవ్యక్తమైన అనురాగం! అందుకే ఇంతవరకూ రాగలిగేను, ఇలా చేయగలుగుతున్నాను...

నేనెవరినోనని, పైవాడినేమోనని, ఎవరి బంధువునోనని తెలిసికోగలిగే ఖాళీ పని ఎవరికీలేదు అక్కడ... పైగా నేనూ అక్కడ ఉన్నవాళ్ళ స్థాయిలోనే ఉన్నాను కాబట్టి నన్నెవరూ ప్రత్యేకంగా చూడలేదు కూడా!

మంగళ సూత్రధారణ జరిగింది... అప్పగింతల సమయంలో ఆ అమ్మాయి తల్లిదండ్రులు కన్నీళ్ళు పెట్టుకోవడం అందరూ చూసారు గానీ— నేను మాత్రం ఆ అమ్మాయిని, ఆమె ప్రక్కన కూర్చున్న పెళ్ళికొడుకుని, ఆమె తల్లిదండ్రుల్ని సరిగ్గా చూడలేక పోయాను— నా కళ్ళల్లో ఏర్పడిన కన్నీటి పొరను తుడుచుకొనేవరకూ!

చదివింపుల సమయంలో ట్రంకు పెట్టి దగ్గర పుస్తకం పట్టుకొని కూర్చున్న కుర్రాడికి పేరు చెప్పి నా చేతిలోని పాకెట్టును ఇచ్చి, మరోసారి మదుపర్కాల్లో ఉన్న వధూవరుల్ని చూసి అక్కడ్నుంచి బయల్దేరి వెళ్ళిపోతున్నప్పుడు పందిట్లో ఎవరో ఆడవాళ్ళు అనుకుంటున్న మాటలు నా చెవిలో పడ్డాయి.

"జయమ్మ నిజంగా అదృష్టవంతురాలే ఒదినా! బుద్ధిమంతుడు, అందగాడు, చేపల కేంద్రంలో ఉద్యోగం ఉన్న రాజారావు మొగుడిగా దొరికాడు... పైగా మనందరికీ దగ్గర్లో కడియంలోనే ఉంటుంది..."

> మంగళ సూత్రధారణ జరిగింది... అప్పగింతల సమయంలో ఆ అమ్మాయి తల్లిదండ్రులు కన్నీళ్ళు పెట్టుకోవడం అందరూ చూశారుగానీ నేనుమాత్రం ఆ అమ్మాయిని, పెళ్ళి కొడుకునిసరిగ్గా చూడలేక పోయాను



"ఆ అమ్మాయి పేరు జయమ్మ అన్నమాట, అత్తవారిల్లు కడియం అన్నమాట' అని అనుకొని అక్కడ్నుంచి ఊళ్ళోకి వెళ్ళి కాసేపు ఆగి ద్వారపూడి వెళ్ళిపోయాము...

నాకెందుకో ఎంతో తృప్తిగా ఉంది— ఆ తృప్తి ఇచ్చిన ఆనందంతో ప్రశాంతంగా పట్టేంది నిద్ర!

పెళ్ళయ్యాక రెండుమూడుసార్లు భర్తతో కడియం బస్టాండులో, అయిదారుసార్లు అమ్మగారింటి దగ్గరా కన్పించింది ఆ అమ్మాయి...

...ఆ సంవత్సరం సంక్రాంతి పండుగ రెండు రోజులుందనగా...

ఆ రోజు...

ఆ సంఘటన కళ్ళకు కట్టినట్టుగా గుర్తొస్తుంది నాకు...
నా సర్వాంగాలూ నా స్వాధీనం తప్పివణుకుతున్నాయి...

ఆ రోజు సాయంత్రం... ధవళేశ్వరం బస్టాండు దగ్గర...

ఎవరో పిలిచారు... మెదడును పట్టి పిండేసే, నా గుండెను పీల్చేసే ఆ సంఘటన గుర్తురాబోయే ఆ సమయంలో నన్నెవరో పిలిచారు...

అతి కష్టం మీద మళ్ళీ ఈ లోకంలోకి వచ్చేను...

...టైమయ్యిందట!

లేచి కొంతసేపు నడిచి ఆ గదిలోకి వెళ్ళేను... ఆ గదిని చూసి చాన్నాళ్ళయ్యింది... ఆ గదిలోని వ్యక్తినా వైపు నవ్వుతూ చూసాడు... ఇన్నాళ్ళుగా 'వాళ్ళల్లో' ఎవ్వరూ నా వైపు అలా నవ్వుతూ చూడలేదు... అతని పెదవులు కదిలాయి కొంతసేపు... ఆ సమయంలో ఎవరికైనా అయితే ఆ పెదవుల కదలికకు గుండె తేలికవుతుందేమో, కొంతైనా కొత్తఊపిరి సంతరించుకుంటుందేమో గానీ నాకు మామూలుగానే ఉంది... ఎప్పటిలానే ఉంది...

అతనిచ్చినవి తీసుకొని బయటకు నడిచాను...

బయట... పాతికేళ్ళు పైబడ్డ నా కొడుకు బాబీ, ముప్పై ఏళ్ళ క్రితం నేను పెళ్ళి చేసుకున్న వరలక్ష్మి ఉన్నారు... వాళ్ళు నన్ను ఆనందంగా చుట్టు ముట్టారు.

వాళ్ళతో పాటూ మా ఊరు వెళ్ళే బస్సు ఎక్కాను...

ఆ బస్సు ఇప్పుడు ధవళేశ్వరం మీదుగానే వెళ్తుంది...

మరో ముప్పై నిముషాల్లో... ధవళేశ్వరంలో... ఊరి చివర... ఆ ఇల్లు... అక్కడ... ఆ అమ్మాయి... బస్సులో కూర్చున్నానే గానీ నాకు అవే ఆలోచనలు...

ఆ అమ్మాయి కన్పిస్తుందా?... అదే ప్రశ్న ప్రతీసారీ!.

నాకెందుకో ఆ అమ్మాయి తప్పకుండా కన్పిస్తుందని అన్పిస్తుంది... నా నమ్మకం ఏమవుతుందో?

బస్సు ఒకచోట ఆగింది... తర్వాత మళ్ళీ ధవ

శ్వరంలోనే ఆగుతుంది... బస్సు ఆగేలోగానే ఆ ఇల్లు కన్పిస్తుంది... ఆ ఇంటి దగ్గర ఆ అమ్మాయి...

బస్సు అప్పుడే ఊళ్ళోకి ప్రవేశించింది... అప్పుడైతే ఊళ్ళోకి వెళ్ళడానికి రాజమండ్రి దాటాక పావుగంటపైనే పట్టేది... కానీ ఇప్పుడు ఊరు బాగా పెరిగిపోయింది...

ఇప్పుడా ఇంటిని గుర్తుపట్టడం కష్టమేమో అన్న ఆలోచన వచ్చి గుండె గుభేలు మంది... నా దృష్టి అంతా కిటికీలోంచి ప్రక్కకే! కనురెప్ప వేయకుండా చూస్తున్నాను...గుండెలో ఏదో వేగం క్రమక్రమంగా పెరిగిపోతుంది...

అదిగో... అదే, అదే ఇల్లు... అప్పటికీ ఇప్పటికీ మరింత పాతబడింది తప్పవి మాత్రం మెరుగుపడలేదు.

మరి... ఆ అమ్మాయి...?

ఓ ఎడ్లబండి అడ్డు రావడంతో బస్సు ఆగింది...

అదిగో... ఎవరో వస్తున్నారు... వచ్చి కూర్చున్నారు... ఎవరు? ఎవరూ...? పరిశీలనగా చూసాను వచ్చి మట్టి అరుగు మీద కూర్చున్న ఆమెను...

ఆమె ఆ అమ్మాయిలాగే ఉన్నట్టుంది... లాగే ఏమిటి, ఆ అమ్మాయే!... నా నమ్మకం వమ్ముకాలేదు!

బస్సు కదిలింది... నేను ఆ అమ్మాయినే చూస్తున్నాను... నా దృష్టి ఆ అమ్మాయి కళ్ళమీద పడింది...

ఆ కళ్ళల్లో అప్పటిచూపు... లేదు! గాజుకళ్ళల్లాగ, జీవం జీర్ణించిపోయినట్టుగా, దిగులు పొరలు మందంగా క్రమ్మేసినట్టుగా... నా గుండె బరువెక్కిపోయి క్రిందకు జారిపోతున్నట్లన్పించింది...

బస్సు ముందుకు వెళ్ళిపోయింది... ఎంత వెనక్కి చూసినా డాబాలు అడ్డొచ్చి ఆ ఇల్లు కనబడలేదు...

"ఏంటి నాన్నా చూస్తున్నావ్?" బాబీ అడిగాడు...

"ఏం లేదురా..." అని అందామనుకున్నాను గానీ గొంతు గుండెలోకి వెళ్ళిపోయి ఆ మాట పైకి రాలేదు... ఏం లేదన్నట్టు తల అడ్డంగా ఊపాను...

ఆ అమ్మాయి మదుపర్కాల్లో ఉన్నప్పటి రూపం, ఇప్పటి రూపం రెండూ కళ్ళముందు కదలాడి కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరగబోతుంటే అతికష్టంమీద ఆపుకోగలిగాను గానీ— మెదడులో రగులుతున్న ఆలోచనలు మాత్రం ఎంత ప్రయత్నించినా ఆగడంలేదు... అవి అలా సాగిపోతూనే ఉన్నాయి!

ఆ ఆలోచనల్లో ఓ ఆలోచన... తళుక్కున మెరిసింది!

మళ్ళీమళ్ళీ అది నా మెదడు మీద దాడి చేయడం మొదలుపెట్టింది...

ఇంటికి వెళ్ళాక—

ఆ రాత్రి బాబీని నా వెంట ద్వారపూడి వంతెన వరకూ తీసుకెళ్ళి, అక్కడనుండి తాపేశ్వరం వెళ్ళే రోడ్డుమీద నడుస్తూ విషయం అంతా చెప్పాను...

నేను చెప్పింది విని వాడు ఏమనుకుంటాడో ఏమంటాడో అని అనుకున్నాను గానీ— వాడు నేనన్నదానికి కాదనకుండా ఒప్పుకున్నాడు—

వరలక్ష్మి కూడా కాదనలేక పోయింది చెప్పింది విన్నాక!

మర్నాడే నేను, వరలక్ష్మి, బాబీ వెళ్ళి వాళ్ళనందర్నీ ఎంతో కష్టపడి ఒప్పించేం! ఎలాగైతేనేం— నేననుకున్నది చేయగలిగాను!

కాకపోతే—

పెళ్ళయిన కొద్ది నెలలకే వచ్చిన సంక్రాంతి పండుగకు అత్తవారింటికి ఆనందంగా వెళుతున్న రాజారావుని, పండుగ కారణంగా ఎక్కువ ట్రిప్పులు వేసి బాగా అలసిపోయి ఆ అలసటను తీర్చుకోవడంకోసం ఓ 'బాటిలు' బిగించి ఆ నిషాలో నేను రోజూ ద్వారపూడి నుండి రాజమండ్రికి, రాజమండ్రినుండి ద్వారపూడికి ట్రిప్పులు వేసుకొని కడుపు నింపుకునే మెటాడర్ వేన్‌తో ధవళేశ్వరం బస్టాండు దగ్గర గుద్దేసి చంపేసి, ఆ పాపానికి పరిహారంగా ఏడేళ్ళు జైలు శిక్ష అనుభవించి వచ్చిన నాకు— బాబీని, వరలక్ష్మిని ఒప్పించి... ధవళేశ్వరం వెళ్ళి వాళ్ళను కూడా ఒప్పించి జయమ్మకు, బాబీకి పెళ్ళిచేసి ఉండకపోతే, జయమ్మ కళ్ళల్లో మళ్ళీ అప్పటి వెలుగును నింపి ఉండకపోతే— మళ్ళీ కొత్త ఊపిరి వచ్చేదా? *





## మాస్టర్

నిర్మాతని ప్రేక్షకుడు అడిగాడు.

'ప్రేమ విలాసం సిన్మాలో డ్యూయెట్ సాంగ్స్‌కి స్టెప్స్ నేర్పిన నృత్య దర్శకుని అడ్రస్ యిస్తారా?'

"అతనా! హిహ్హి. హనుమాన్ వ్యాయామశాల అడయార్ మద్రాస్" చెప్పాడు నిర్మాత.

—కె.ఆంజనేయకుమార్

(భోగాపురం)


# మీకలల్ని సఫలం చేయనీయండి మమ్మల్ని!

మీ ముద్దుల పాప చిన్నతనం నుండి ఆమె పై మీరెన్నో ఆశలు పెంచుకున్నారు. ఆమె భవిష్యత్తు గురించి మీరెన్నో కలలుకన్నారు. అవి సఫలీకృతం ఆయేందుకు అవసరమైన పునాది ఇప్పుడే వేయాలి మీరు.

స్కూలు వదిలి కాలేజీలో చేరుతున్న మీ పాపను డాక్టరుగాగానీ, ఇంజనీరుగాగానీ చూడాలనే మీ కోరికను తీర్చడానికి మమ్మల్ని ప్రయత్నించనీయండి. మీ పాప చదువు సంధ్యల పట్ల అత్యధిక శ్రద్ధ వహించడమే కాక ఆమె సర్వతోముఖంగా అభివృద్ధి చెంది పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని సంతరించుకునేలా దోహదం చేసే సంస్థ మా

## ప్రశాంత్ మహిళ రెసిడెన్షియల్ కాలేజి

ప్రశాంత వాతావరణంలో సభ్యత సంస్కారాలు వెల్లివిరిసే పరిసరాలలో విదేశాల్లో కూడా బోధనానుభవం గడించిన విద్యావేత్తల ఆధ్వర్యంలో ప్రారంభముతున్న

## ప్రశాంత్ మహిళ రెసిడెన్షియల్ కాలేజి

మీ పాప భవిష్యత్తుకు బంగారుబాట వేస్తుంది.

* Bip, M.P. గ్రూపులు * తెలుగు, ఇంగ్లీషు మీడియంలు * సంవత్సరానికి 300 రోజుల శిక్షణా కాలము * చక్కని హాస్టలు వసతి
* 10వ తరగతిలో 50 % మార్కులు కనీస అర్హత * మొదటినుండి మెడికల్ మరియు ఇంజనీరింగ్ ఫౌండేషన్‌తో శిక్షణ

## ప్రశాంత్ మహిళ రెసిడెన్షియల్ కాలేజి

రాజేంద్రనగర్, 2వ లైను, బృందావన్ గార్డెన్స్ గుంటూరు—522 006. ఫోను: 31661 పి.పి

డైరెక్టర్ ఓరుగంటి రాజేంద్రప్రసాద్
M.Sc., M.Ed,

ప్రిన్సిపాల్ డా.ఓరుగంటి విజయశ్రీ
M.A.,Ph.D

ప్రాస్పెక్టస్ మరియు అప్లికేషన్ ఫారములకు వెంటనే డైరెక్టర్ లేక ప్రిన్సిపాల్‌ను సంప్రదించండి

మీ పాప మీ పాపేకాదు, మా పాప కూడా!

TARA-180